

2లో..

## అర్ధరాత్రి వేళ పోలీస్ స్టేషన్లలో సీపీ ఆకస్మిక తనిఖీ

గీసుగొండ, సంగెం పోలీస్ స్టేషన్ల పరిశీలన

విధుల్లో అలసత్వం వహించొద్దు

సీపీ అంబర్ కిషోర్ ఝా


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 154 | శనివారం | 16 డిసెంబర్ 2023 | పేజీలు : 07 | వెల రూ. 5




# పస్తులతో.. చస్తున్నాం

- ఫ్రీ బస్సులతో మా బతుకులు ఆగం
- కదం తొక్కిన ఆటో కార్మికులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోడ్డెక్కిన ఆటోలు
- తగిన న్యాయం చేయకుంటే ఆత్మహత్యలే దిక్కన్న ఆటో డ్రైవర్లు



వివరాలు 2లో..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు బ్రేక్ పడింది. ఆటో స్టాండ్ నుంచి ఒక్క ఆటో కూడా బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. రోజంతా పడిగాపులు కాసినా ఆటో ఎక్కేవారే కరువు కావడంతో ఉపాధి కోల్పోయి పస్తులతో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఫైనాన్స్‌లో ఆటోలు కొనుగోలు చేసిన వారు కిస్తీలు కట్టలేక నానా తంటాలు పడాల్సి వస్తోంది. గత మూడు సంవత్సరాలుగా కరోనాతో ఆటో కార్మికుల బతుకులు ఆగం కాగా, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు ఉపాధే లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్రీ ప్రయాణం నిలిపివేయాలని కోరుతూ శనివారం ఆటో కార్మికులు కదం తొక్కారు. ఉచిత ప్రయాణాన్ని అయినా రద్దు చేయండి, లేకుంటే ఆటో డ్రైవర్లకైనా ఉపాధి చూపండి అంటూ వందలాది మంది కార్మికులు రోడ్డెక్కి నిరసన చేశారు.
- వరంగల్ వాయిస్, వరంగల్



## మేడారం జాతరకు ముందస్తు ప్రత్యేక బస్సులు

మేడారం సమ్మక్క, సారలమ్మల జాతరకు ముందస్తు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి మేడారం సందర్శనకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం రేపటి నుంచి బస్సులు నడిపించేందుకు టీఎస్ఆర్ టీసీ ముందుకు వచ్చింది. హనుమకొండ నుంచి ప్రత్యేక బస్సులు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 17 నుంచి ప్రతి బుధవారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో నడుపబడునని వరంగల్ రీజియన్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. ప్రయాణికులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకొని సమ్మక్క సారలమ్మ కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ



2లో..

## మంత్రి తుమ్మలను కలిసిన గంజి శ్రీనివాసులు




# పస్తులతో.. చస్తున్నాం




**ఫ్రీ బస్సులతో మా బతుకులు ఆగం**

**కదం తొక్కిన ఆటో కార్మికులు**

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోడ్డెక్కని ఆటోలు**

**తగిన న్యాయం చేయకుంటే ఆత్మహత్యలే దిక్కన్న ఆటో డ్రైవర్లు**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు బ్రేక్ పడింది. ఆటో స్టాండ్ నుంచి ఒక్క ఆటో కూడా బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. రోజంతా పడిగాపులు కాసినా ఆటో ఎక్కేవారే కరువు కావడంతో ఉపాధి కోల్పోయి పస్తులతో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఫైనాన్స్ లో ఆటోలు కొనుగోలు చేసిన వారు కిస్తీలు కట్టలేక నానా తంటాలు పడాల్సి వస్తోంది. గత మూడు సంవత్సరాలుగా కరోనాతో ఆటో కార్మికుల బతుకులు ఆగం కాగా, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు ఉపాధే లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్రీ ప్రయాణం నిలిపివేయాలని కోరుతూ శనివారం ఆటో కార్మికులు కదం తొక్కారు. ఉచిత ప్రయాణాన్ని అయినా రద్దు చేయండి, లేకుంటే ఆటో డ్రైవర్లకైనా ఉపాధి చూపండి అంటూ వందలాది మంది కార్మికులు రోడ్డెక్కి నిరసన చేశారు.

### ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలి

జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని కమలాపూర్ మండల కేంద్రంలో జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టిన ఆటో డ్రైవర్లు ప్రధాన రహదారి వెంట ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసి కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తక్కలపల్లి సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ప్రజలకు బాగానే ఉన్నప్పటికీ ఆటో డ్రైవర్ వృత్తినే నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న డ్రైవర్లు రోడ్డున పడ్డారని అన్నారు. వారికి నెల నెల ఉపాధి కల్పించి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కొనసాగిస్తే బాగుంటుందని ప్రభుత్వానికి సూచన చేశారు. ప్రతినెల రూ.20 నుంచి 25 వేలు అందజేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి సారంగం, లింగమూర్తి, మౌటం కుమారస్వామి, రాజేందర్, ధనుంజయ్, బాబు, పాల్గొన్నారు.

### ఆటో కార్మికులను రోడ్డున పడేశారు..




రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించాలని తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మహా సంఘం, ఆటో యూనియన్ బీఎంఎస్ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆటో కార్మికుల కుటుంబాలను వీధిన పడకుండా చూడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. నేడు నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను గుర్తించకుండా తీసుకున్న ఈ నిర్ణయం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీవన భృతి కల్పించాలని, లేకుంటే లక్షలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే చాలామంది కార్మికులు ఇబ్బందులకు గురై బాధపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆటో కార్మికుల గురించి ప్రత్యేక జాబ్ మేళా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

పట్టణ కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం సౌకర్యాన్ని రద్దు చేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి ఆటో యూనియన్ బాధ్యులు వినతిపత్రం సమర్పించారు. జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో దిగిన ఆటో డ్రైవర్స్ యూనియన్ భాద్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు.

# అర్థరాత్రి వేళ పోలీస్ స్టేషన్లలో సీపీ ఆకస్మిక తనీఖీ

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాత్రి సమయాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు పరిశీలించేందుకు గాను గత అర్ధరాత్రి సమయంలో గీసుగొండ, సంగెం పోలీస్ స్టేషన్లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనీఖీ చేసారు. ఈ తనీఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించడంతో పాటు, పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకోవడంతో పాటు, రాత్రి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. అలాగే పెట్రోలింగ్ వాహనం పనితీరును పోలీసు కమిషనర్ పరిశీలించడంతో పాటు, రాత్రి సమయాల్లో సిబ్బంది నిర్వహించాల్సిన విధులు పెట్రోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయని, ఇకపై రోజువారి పోలీసింగ్ అధికారులు దృష్టిపెట్టాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోవాహనాలను వినియోగిస్తూ ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుదని తెలిపారు. అలాగే స్థానికంగా ముందస్తు సమచారాన్ని సేకరించాల్సిన బాధ్యత సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిపై ఉందని, విధుల్లో ఆలసత్వంతో వ్యవహరించవద్దని, నిరంతరం అప్రమత్తంగానే వుండాలని, పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరమైన వాతవరాన్ని ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను అదేశించారు. డిస్ట్రిక్ట్ గార్డ్స్ సిబ్బందితో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమావేశమయ్యారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముందుగా డిస్ట్రిక్ట్ గార్డ్స్ సంబంధించిన వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో డిస్ట్రిక్ట్ గార్డ్స్ సిబ్బంది పనితీరు బాగుందన్నారు. ఇదే రీతిలో రాబోవు రోజుల్లో కోనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో క్రైమ్స్ డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు రమేష్, నాగయ్య, ఆర్.ఐలు శ్రీనివాస్, స్పజ్జన్‌రాజ్, శ్రీధర్ పాల్గోన్నారు.

# ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

**విద్యార్థులకు పాఠాల బోధన**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఆస్పరేషనల్ డిస్ట్రిక్ట్ బ్లాక్ లెవెల్ ప్రోగ్రాంలో భాగంగా మహా ముత్తారం మండలంలోని బోర్ల గూడెం ప్రాథమిక పాఠశాల, మహా ముత్తారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు విద్యార్థులకు గణిత శాస్త్రం పాఠాలు బోధించారు.

# ఢిల్లీలో జరిగే మహాధర్నాకు తరలిరండి



**ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల చక్రపాణి**

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ఈనెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు మాదిగలందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల చక్రపాణి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో మహాధర్నా కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ 28 సంవత్సరాలుగా పోరాటం చేస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వస్తే వంద రోజులలో వర్గీకరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఐదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉండి వర్గీకరణ బిల్లును పట్టించుకోవడం లేదన్నారు. 2018లో తిరిగి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాలుగేళ్లు గడిచిన వర్గీకరణ బిల్లు ఊసత్తాడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగ వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లలో న్యాయం చేకూర్చే ఏబీసీడీ వర్గీకరణ డిమాండ్ ను సామాజిక ప్రగతిశీల, ప్రజా ఉద్యమాలు అందరూ ఆమోదించిన అంశమేనని తెలిపారు. ప్రభుత్వంపై దళితులందరూ నిబద్దతతో ఉమ్మడిగా పోరాటాలు చేయవలసిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ 21న జంతర్ మంతర్ వేదికగా నిర్వహించే మహా ధర్నాకు మాదిగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ముల నగేష్, రాజు గడిపె ఐలయ్య, గడుపె వీరస్వామి, అంబాల రాజు, గడిపె రమేష్, కండె చిరంజీవి, పచ్చునూరి సదానందం, తాళ్లపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన గంజి శ్రీనివాసులు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వంలో చేనేత,జౌళి శాఖ మంత్రిగా నియమితులైన సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావును తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. నూతన ప్రభుత్వంలో చేనేత కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించి, తెలంగాణలో చేనేత పరిశ్రమను నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని, చేనేతకు, మరనేతకు కావలసిన అత్యాధునికమైన యంత్రాంగాన్ని కల్పించి, వాటి ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ పాలనలో సుఖ సంతోషాలతో జీవించే విధంగా సంస్కరణలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కొండా పద్మ, టీపీసీసీ కార్యదర్శి కుకుడాల బాలకృష్ణ, పద్మశాలి హ్యాండ్లూమ్ టెక్స్ టైల్స్ మార్కెటింగ్(ఉప్పల్)చైర్మన్ గడ్డం వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర జ్యువెలరీ ట్రేడింగ్ అసోసియేషన్ సెక్రటరీ గంజి వేణు, గంజి వరప్రసాద్, పున్న దామోదర్ మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక ఫాసిస్టు పాలనను తిప్పికొట్టాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని విప్లవ కార్మిక సంఘం నాయకత్వంలో సంఘటితపరచి, సమరశీల పోరాట బాట పట్టించేందు కోసం 15 నుంచి 17వరకు చెన్నై కామ్రేడ్ శర్మిష్ట, శివరాం మెమోరియల్ హాల్ లో టీయూసీఐ 10వ అఖిల భారత మహాసభలు తీవ్ర వర్షంలో సైతం 14 రాష్ట్రాల 300ప్రతినిధులతో 15న విజయవంతంగా ప్రారంభమయ్యాయని, ఇవి 17వరకు జరుగుతాయని,నాలుగు దేశాల నుంచి ప్రత్యేక ఆహ్వానిత ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారని టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర గౌరవ ప్రతినిధి గడ్డం సదానందం తెలిపారు. ఈ సందర్భంగా టీయూసీఐ అఖిల భారత కార్యదర్శి కామ్రేడ్ సంజయ్ సింగ్వీ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగ్వి ప్రతినిధులను ఉద్దేశిస్తూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ మోడీ పాలన నేడు మరింత విషపూరితమైందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, రెక్కాడితే గాని డొక్కాడని అణగారిన మెజారిటీ శ్రామిక వర్గం తమ శ్రమ ద్వారా సృష్టించిన సమస్త సంపదను భూస్వామ్య, బడా పెట్టుబడి దారుల, సామ్రాజవాద, బహుళజాతి, కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని తెలిపారు. జీఎస్టీని ప్రవేశపెట్టి అదనపు పన్నుల భారాన్ని మోపటం, మరోవైపు నిరంతరం నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని దాంతో సామాన్యులు బ్రతుకలేని పరిస్థితిని కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక వ్యవసాయ సంక్షోభానికి పాల్పడి, కార్మిక హక్కులను కాలరాసి, నిరుద్యోగానికి, పేదరికానికి కారణమై ప్రజల మధ్య తీవ్ర అసమానతలను పెంచివేశారని. దాంతో ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి, అలజడిలకు కారణమైనారని చెప్పారు. దానికి సరైన పరిష్కారాన్ని చూపకుండా రాజ్యాంగ ప్రమాణాలను తుంగలో తొక్కి కేవలం నిర్బంధం, అణచివేతల ద్వారా ఫాసిస్టు పాలనకు ఒడి గట్టడం కేంద్రం వైఫల్యానికి నిదర్శనమని నొక్కి చెప్పారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతూ, నిరుద్యోగ సైన్యాన్ని పెంచారని మండిపడడ్డరు. 44కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ లకు కుదించి కార్మిక వర్గానికి తీరని ద్రోహాన్ని తల పెట్టిందని విమర్శించారు. అభివృద్ధి జపంతో ప్రజలను మోసగిస్తూ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనువాదాన్ని ప్రవేశ పెడుతూ, మత విద్వేషాలను రెచ్చ గొడుతున్న మతోన్మాద బీజేపీ(ఆర్ఎస్ఎస్)పాసిస్టు పాలనలో ఏనాడు లేని రీతిలో అవినీతి పెరిగి పోయిందన్నారు. ఈ దోపిడీ అనుకూల, ప్రజావ్యతిరేక పాసిస్టు పాలనను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో వివిధ రంగాల పోరాటాలకు వెన్ను దన్నుగా నిలబడటం కార్మిక వర్గం తక్షణ కర్తవ్యం అని చెప్పారు. ఆ కర్తవ్య నిర్వహణలో భాగంగానే విప్లవ కార్మిక సంఘం టీయూసీఐ బలోపేతానికి కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆరుగురు ప్రతినిధులతో పాటు ప్రజా పంథాకు చెందిన ఐఎఫ్ టీయూ నుంచి మరో 10మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలిచ్చిన తీర్పును గౌరవిద్దాం

### మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గంలోని ప్రజలు, వ్యాపార వర్గాలు ముఖ్యంగా పార్టీకి పట్టుకొమ్మలాంటి కార్యకర్తలు, నాయకులు తన ఫోన్ ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పుపై వారి బాధను వ్యక్తం చేస్తున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. వారందరికి ఒక్కటే మనవి చేస్తున్నా, ప్రజలిచ్చిన తీర్పును గౌరవిద్దామని తెలిపారు. తనపై, పార్టీ పట్ల నమ్మకంతో ఓటువేసిన ప్రజలకు అండగా ఉందామని పిలుపునిచ్చారు. అధికార పక్షంలో చేసిన అభివృద్ధితో పాటు ప్రతిపక్షంలో కూడా ప్రజల తరపున పోరాడుదామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, మీ కష్టసుఖాల్లో నేను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ప్రజల తరపున నిలబడటం కూడా ఒక రకమైన సేవే అని పేర్కొన్నారు. నన్ను నమ్ముకున్న ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని తెలిపారు. మోసం చేసిన మిత్రులకు విధియే సమాధానం చెప్తుందన్నారు. ప్రస్తుత అధికార పార్టీ నాయకులకు విజ్ఞప్తి, ఎన్నికల వరకే రాజకీయం చేద్దామని, క్షక్ష్య పూరిత రాజకీయాలకు దయచేసి తెరలేపొద్దని హితవు పలికారు. అందరూ మన వాళ్లే అనే సోదరభావంతో ముందుకు వెళ్దామని సూచించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కోసాగించాలని, మరింత అభివృద్ధి చేయాలని గండ్ర వెంకట రమణా రెడ్డి కోరారు.

## కొత్త సభ్యులను చేర్చుకుంటాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓరుగల్లు డెస్క్ జర్నలిస్టుల మ్యూచివల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షుడు సీహెచ్ సోమనర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎల్ రఘుపతి, కార్యదర్శి పీ నాగరాజు, సహాయ కార్యదర్శి ఆర్ ఓంకార్ , కోశాధికారి బండి రాజు, కార్యవర్గ సభ్యులు డీ రాజు , వనం శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మన సొసైటీ కార్యకలాపాలపై చర్చించారు. ప్రస్తుతం సొసైటీ లో 34మంది సభ్యులు రెగ్యులర్ గా ప్రతి నెలా రూ.300 చొప్పున వాటా ధనం చెల్లిస్తున్నారు. 5మంది రెగ్యులర్ గా చెల్లించడం లేదు. దీనిపై వారితో మాట్లాడగా పంపిస్తామని చెప్పారు. ఈ నెల చూద్దామని ఆతర్వాత నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు. ఈనెల, వచ్చే నెలలో కొత్త సభ్యులను చేర్చుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి బ్యాంకు అకౌంట్ లో సభ్యులే నేరుగా వాటా ధనం చెల్లించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు గొర్రెకుంట విద్యార్థులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 4న మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బేస్ బాల్ పాఠశాలల ఎంపిక క్రీడా పోటీలలో 17 ఏళ్ల విభాగంలో గీసుకొండ మండలం 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని వారి క్రీడా ప్రతిభతో శ్రీచరణ్, ఎల్.అక్షయ్, బి.నందినిలు ఈనెల 17, 18, 19వ తేదీలలో తొర్రూర్ పట్టణంలో జరుగు రాష్ట్రస్థాయి బేస్ బాల్ పాఠశాలల క్రీడలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నలిమెల జ్యోతిర్మయి, పీఈటీ జలగం రఘువీర్ తెలిపారు. తమ క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బి.శ్రీచరణ్, ఎల్.అక్షయ్, బి.నందినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.జ్యోతిర్మయి, స్థానిక కార్పొరేటర్ ఆకుల మనోహర్ , విద్యా కమిటీ చైర్మన్ జున్ను కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం షహీన్ సుల్తాన, ఎం.చంద్రశేఖర్, మార్త శ్రీనివాస్, సీహెచ్ అనిత, పి.ప్రణతికుమారి, యం.ప్రభాకర్, జె.దమరి, ఆర్.రాజు, సీహెచ్ శ్రీదేవి , గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పంతకానీ శ్రీనివాస్





**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన పంతకాని శ్రీనివాస్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు గండి చెరువు వెంకన్న గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు గండి చెరువు వెంకన్న గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. నా పై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు చాలా సంతోషంగా ఉందని శ్రీనివాస్ అన్నారు. బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని, బీసీ కులాల ఐక్యత కోసం, బీసీల హక్కుల సాధన కోసం, వారి సంక్షేమానికి, అభ్యున్నతికి నా వంతుగా కృషి చేస్తానని పంతకాని శ్రీనివాస్ తెలిపారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కోడెపాక రాజు తల్లి పూలమ్మ ఇటీవల మరణించగా, గ్రామానికి చెందిన వాయుపుత్ర ఆటో యూనియన్ తరపున రూ.14వేలు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాసమల్ల నరేష్, ఉపాధ్యక్షుడు అల్లం వజ్రం, కార్యదర్శి కోడపక సురేష్, రాజు, అనిల్, అల్లం నాగరాజు మాట్ల రాజు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## అయ్యప్పలకు సామూహిక అన్నదానం



**వరంగల్ వాయిస్, కాటారం :** అయ్యప్ప స్వామి భిక్ష కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహోదరుడు, శ్రీపాద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారేపల్లి లో గల శ్రీ ధర్మశాస్త్రా అయ్యప్ప స్వామి దేవాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సౌజన్యంతో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో శ్రీనుబాబు పాల్గొని అయ్యప్ప స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు సామూహిక భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, వారితో కలిసి శ్రీను బాబు సహ పంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా శీను బాబు మాట్లాడుతూ పాడిపంటలు సమృద్ధిగా పండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భిక్ష కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరు ప్రభాకర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్, అయ్యప్ప దేవాలయ నిర్వాహకులు బచ్చు అశోక్ గుప్తా, ప్రకాష్ గుప్తా, పీచర రామకృష్ణారావు, జనగామ కార్తీక్ రావు, కరుణాకర్ రావు, కొట్టే ప్రభాకర్, చీమల రాజు, పసుల మొగిలి, అంగజాల అశోక్, బొమ్మన శ్రీనివాస్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి, కదారి విక్రమ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** చర్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థిని, విద్యార్థులకు పోస్కో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 పైన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుచ్చయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, తొర్రూర్ సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అరుణ, చైల్డ్ హెల్ప్ లైన్ మెంబర్ వీరన్న, ఉపాధ్యాయ బృందం, ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినిలపై సామాజిక మాధ్యమాల చెడు ప్రభావం చూపుతున్నాయన్నారు. వాటిని సరైన దిశగా ఉపయోగించుకొని మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని తెలిపారు. నాగవాణి మాట్లాడుతూ విద్యార్థినిలు తమ చుట్టుపక్కల ఏ సమస్యలున్నా 1098కు ఫోన్ చేసి తెలుపగలరని బాల్యవివాహాలను, గృహహింస లాంటివి అడ్డుకోవాలని, ఈ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు లింగ బేధం లేకుండా చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం స్టూడెంట్ ఫ్రెండ్లీ టీచర్ సబీయభాను, యాకుబ్ అలీ, జయపాల్ రెడ్డి ,రవీందర్ కుమార్, మల్లేశం, శ్రీనివాస్, నర్మద పాల్గొన్నారు.

## వారి చిరునవ్వుల్లో స్వచ్ఛత గోచరిస్తుంది

### రాష్ట్రపతి అవార్డు గ్రహీత, లయన్ పరికిపండ్ల వేణు



**వరంగల్ వాయిస్, రెడ్డి కాలని :** థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి పరికిపండ్ల వేణు కుమార్తె అభిజ్ఞ -లక్ష్మీగణపతిల నిశ్చితార్థం సందర్భంగా రెడ్డి కాలనిలోని “అతిధి” దివ్యాంగుల ఆశ్రమంలోని పిల్లలకు పండ్ల పంపిణీ, స్వీట్స్, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పండ్ల పంపిణీ చేసేటప్పుడు ఆ చిన్నారుల ముఖాల్లో కనిపించిన చిరునవ్వులో స్వచ్ఛత గోచరించిందన్నారు. ఒకరికి ఇవ్వగానే పక్క వారికి ఇవ్వండని చూపించడం, ఒకరికొకరు సహాయం చేసుకోవడం, థాంక్స్ అని చెప్పడంలో స్వచ్ఛత, నిష్కల్మషత్వం కనిపించిందన్నారు. వారితో గడిపిన సమయం మానసికంగా చక్కటి ప్రశాంతమైన స్వచ్ఛమైన వాతావరణంలో ఉన్నట్లుగా అనిపించిందన్నారు. సమాజంలో ప్రతి కుటుంబంలో జరిగే శుభకార్యాల సందర్భంగా ఇంటి ఇలవేల్పు అని, గుళ్లకు, గోపురాలకు వెళ్లి మొక్కలు చెల్లించుకున్న తర్వాతనే కార్యక్రమాలు మొదలు పెట్టే ఆచార, సాంప్రదాయాలున్న సంగతి మనందరికీ విధితమే, దీంతో పాటు తప్పనిసరిగా ప్రతివారు తమ ఇండ్లలో జరిగే శుభకార్యాల సందర్భంగా సమాజానికి దూరంగా ఇలాంటి సేవా గృహాల్లో జీవిస్తున్న నిర్మలమైన మనసున్నవారికి కూడా చేయూతనందించే నూతన ఆచార, సాంప్రదాయాలు కూడా నేటి సమాజంలో రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అభిజ్ఞ, అభిక్రాంత్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ అధికారి ప్రసాద్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ అధికారి ప్రసాద్ అన్నారు. మరిపెడ మండలంలోని ఎల్లంపేట హైస్కూల్ విద్యాశాఖ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ అధికారి ప్రసాద్ అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వామ్యం, విద్యార్థుల నైపుణ్యాలను, చదువు పట్ల శ్రద్ధ తీసుకొని మంచి గ్రేడింగ్ సాధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పూల్ చందు, ఎల్లంపేట హై స్కూల్ హెడ్మాస్టర్ బి భాస్కర్ రావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరహరి, ఎస్ఎంసీ చైర్మన్ దేవేందర్, పాఠశాల సీఆర్పీ సత్య శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే సరైనది

### జిల్లా ప్రిన్సిపల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కేసుల పరిష్కారంలో రాజీమార్గమే సరైనదని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేస్తూ ప్రజల ప్రశాంత జీవనం కోసం ఈనెల 30న జిల్లా న్యాయస్థానం ఆవరణలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపడుతున్నందున వివిధ కేసుల్లో ఉన్న కక్షిదారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ లోక్ ఆదాలత్ కార్యక్రమంలో కేసులకు సంబంధించిన ఇరువర్గాల వారు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. ఇది ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని సదవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గమే సరైనదిగా సూచిస్తూ ప్రతి పౌరుడు రాజీ మార్గాన్ని ఎంచుకునేందుకు బాధ్యత ఉందని గుర్తుచేస్తూ ఆ దిశగా పునరాలోచన చేయాలన్నారు. కేసుల పరిష్కారంతో ప్రశాంత జీవనం గడిపేందుకు వీలుందని జీవన మార్గం సుగమం అవుతుందన్నారు.

## విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేత



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము చంద్రశేఖర్ కుమారుడు కొమ్ము లోకేష్ కు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన సందర్భంగా గ్రామ పాఠశాలలోని విద్యా ర్థిని, విద్యార్థులకు అందరికీ టై బెల్ట్ లను అందజేశారు. దాతలు కొమ్ము చంద్రశేఖర్, కొమ్ము లోకేష్, స్కూల్ చైర్మన్ ఎల్ది అశోక్, హైస్కూల్ హెడ్ మాస్టర్ శశిధర్, ఉపాధ్యాయులు, గ్రామ యువత చిర్ర మధుసూదన్, చరణ్, సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను సన్మానించిన ఎంపీపీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ మంత్రి సీతక్కను శనివారం సెక్రెటరేట్ లో రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండలం ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ గౌడ్ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మోహన్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్లా దంపతులు



**వరంగల్ వాయిస్, పరకాల :** సంగెం మండల జడ్పీటిసి గూడ సుదర్శన్ రెడ్డి - మల్లికాంబల కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులు సుమలత -అశోక్ రెడ్డిలను పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి - జ్యోతి దంపతులు ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19వ డివిజన్ సీతారామస్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం మంత్రి కొండా సురేఖ అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రిని కలిసి ఆలయానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆమె స్పందించి సానుకూలంగా ఆలయానికి వస్తానని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పక్షాన మంత్రి కొండా సురేఖను శాలువాతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ను కూడా కలిసి ఆలయం కమిటీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యేలిశాల ఆనంద్ కుమార్, కార్యదర్శి దాసరి రాజేష్, పాలకొజు కరుణాకర్, కూచన రవీందర్ పాల్గొన్నారు.

## ప్యానల్ స్పీకర్‌గా ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నలుగురు ప్యానల్ స్పీకర్లను ఎన్నుకున్నారు. అందులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పరకాల నియోజకవర్గం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ప్యానల్ స్పీకర్ గా అవకాశం దక్కింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ప్యానల్ స్పీకర్ అవకాశం రావడంతో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏబీవీపీజిల్లా కన్వీనర్‌గా అరేపెల్లి సుజిత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల విద్యార్థి పరిషత్ ఏబీవీపీ జాతీయ మహాసభలు దేశ రాజధాని ఢిల్లీలో డిసెంబర్ 6 నుంచి 10వరకు నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలలో హనుమకొండ జిల్లా కన్వీనర్ గా అరేపెల్లి సుజిత్ ను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆరేపల్లి సుజిత్ నిరంతరం విద్యారంగ సమస్యల మీద పోరాడుతూ అనేక ఉద్యమాలు నిర్వహించడం జరిగింది. కాకతీయ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ చదువుతున్నాడు. గతంలో వరంగల్ మహా నగర్ కార్యదర్శిగా పనిచేశారు. విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థులను జాతీయవాదులుగా తీర్చడంలో కీలకపాత్ర పోషించారు. హనుమకొండ జిల్లా కన్వీనర్ సుజిత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యత ఇచ్చినందుకు ఏబీవీపీ రాష్ట్ర శాఖకు, తెలంగాణ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాబూరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## రాజన్న స్వామిని దర్శించుకున్న రామ రాజేష్ ఖన్నా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వేములవాడ రాజన్నను కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్, నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.హెచ్.ఎం.ఉద్యోగులు అందరికి 100శాతం గ్రాస్ శాలరీ వచ్చేవిదంగా కొత్త ప్రభుత్వం ఇవ్వాలని దేవుడిని కోరుకున్నానని తెలిపారు. ప్రజలు ఎల్లవేళలా సుఖశాంతులతో వర్ధిలాల్లని రాజేష్ ఖన్నా ఆకాంక్షించారు.

## తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశాల పరిశీలనకు గాను ఎస్ఐఈటీ డైరెక్టర్ విజయలక్ష్మి రాష్ట్ర పరిశీలకులుగా ఎంపీపీ ఎస్ పోచంపల్లి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం సీరియళ్లు చూడటం వల్ల పిల్లలు కూడా సీరియల్ చూస్తూ చదువుకు దూరం అవుతారని కనుక పిల్లల పట్ల శ్రద్ధ వహించాలంటే సీరియళ్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల చాలా బాగుందని, మధ్యాహ్న భోజనంలో అప్పుడప్పుడు రాళ్లు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ భవిష్యత్తులో అలా జరగకుండా చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు అబ్దుల్ హై మాట్లాడుతూ మీరు మేము అందరం కలిసి సమిష్టిగా కృషి చేస్తేనే పిల్లలు ప్రయోజకులు అవుతారని తెలిపారు. తల్లిదండ్రుల సహకారం తప్పనిసరిగా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రాధా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉన్నతి పరిశీలనలో భాగంగా రాష్ట్ర పరిశీలకులు విజయలక్ష్మి లష్కర్ బజార్ బాలికల పాఠశాల సందర్శించి ఏడవ తరగతిలో గణిత పాఠాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయురాలు బోధనను ప్రశంసించారు. పిల్లలు చాలా చక్కగా సమాధానాలు చెప్పడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉన్నతికి సంబంధించిన అన్ని రికార్డ్స్ పాఠశాలలో బాగా మెయింటైన్ అవుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

## యువకుడి అత్మహత్య



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల శివారు ఎర్రమట్టి తండాలో దారుణం చోటు చేసుకుంది. ఆదే దండాకు చెందిన భూక్యా వినయ్ అనే యువకుడు స్థానిక చర్చి కాంపౌండ్ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం డోర్నకల్ పట్టణ శివారు ఎర్రమట్టి తండాకు భూక్యా వినయ్ ఉద్యోగాలు రావటం లేదని కోంతకాలంగా డిప్రెషన్ లో ఉంటూ తాను అత్మహత్య చేసుకుంటానని, ఇది సరైందో కాదో.. చెప్పాలంటూ ఇన్ స్ట్రాగ్రాంలో పోస్ట్ పెడుతున్నాడు. కాగా అత్మహత్య పాల్పడే ముందు రాసినట్టు ఉండే ఓ డెత్ నోట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. గతంలో అనేక ఉద్యోగులకు అప్లై చేశానని పేపర్ లీకేజీల వల్ల పలు కోచింగ్ సెంటర్ లలో డబ్బులు కట్టలేక పోతున్నానని, తెలంగాణలో రాబోయే రోజుల్లో నా లాగా ఎవరు ఇబ్బంది పడకుండా నోటిఫికేషన్ లు ఇవ్వాలని ఆవేదన చెందుతూ సూసైడ్ నోట్ లో రాసి ఉంది. శవ పంచనామా చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవ సంబురాలు

### వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయాలి
### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)98వ ఆవిర్భావ దినోత్సవ సంబురాలను ఈ నెల 26న ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయాలని అన్నారు. సమ సమాజ స్థాపన కోసం1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ లోని కాన్పూర్ లో సీపీఐ ఆవిర్భవించిందని, అనేక కుట్ర కేసులను ఎదుర్కొని, వేలాది మంది ప్రాణత్యాగాలతో ఎన్నో వీరోచిత పోరాటాలు చేసిందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగంతో ప్రజా కంఠక నిజాంను తరిమి కొట్టి పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సీపీఐకు తప్ప ఏ ఇతర పార్టీలకు లేదని అన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, వివక్షతను గుర్తించి ప్రత్యేక రాష్ట్రం కోసం మొట్టమొదట తీర్మానం చేసిన జాతీయ పార్టీ సీపీఐ మాత్రమేనని అన్నారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తూ, కూడు, గూడు లేని నిరుపేద ప్రజలకు అండగా ఎర్రజెండా ఉంటున్నదని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది గూడు లేని పేదలను సమీకరించి భూ పోరాటాలు నిర్వహించి, వారికి నీడ కల్పించడం జరిగిందని తెలిపారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను ఆదానీ, అంబానీ లాంటి కార్పరేట్ శక్తులకు దోచి పెడుతూ ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి వేసిందని అన్నారు. ఉన్నత వర్గాలకు, పెట్టుబడి దారులకు రాయితీలు ఇస్తూ పేదలపై పెను భారాన్ని మోపేలా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువులను పెంచిందని అన్నారు. ఇలాంటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పుటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగుతున్న సీపీఐ ఆవిర్భావ దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న హనుమకొండలోని వెయ్యి స్థంబాల దేవాలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రదర్శనకు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నకీర్త ఓదెలు, మునిగాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

### శరణు ఘోషతో మార్మోగిన ఓ సిటీ
### వైభవంగా ప్రదీప్ శర్మ పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 19వ డివిజన్ ఓ సిటీలో శనివారం కేంచ కుమారస్వామి-లక్ష్మి అయ్యప్ప నివాసంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 250పైగా అయ్యప్ప స్వాములు పూజలో పాల్గొని పాటలు పాడుతూ భజన చేశారు. దీంతో ఓ సిటీ అంతా అయ్యప్ప నామస్మరణతో దద్దరిల్లింది. ఈ అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో గురు స్వామి కొల్లూరి యోగానంద్ పాటల బృందంతో పాటలు పాడుతూ స్వాములను, భక్తులను, కాలనీవాసులను ఆకట్టుకున్నారు. ఈ పడిపూజ గురు స్వామి వెల్దే ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కోరే కుమారస్వామి, వెంకటస్వామి రవీందర్, కనిష్క్ వేదా, జిగురు శ్రీను, కంచ సారయ్య, మండల సత్తయ్య, మండల రవి, కంచ మల్లయ్య గురుస్వామి, మండల నరసింహారాములు, నంద రమేష్, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు ఆరోగ్య శాఖ అధికారుల అభినందనలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యూత్ పేస్ట్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ ఎయిడ్స్, టీబీ, బ్లడ్ డొనేషన్ పట్ల అవగాహన పెంపొందించడంలో భాగంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు స్కూల్ విద్యార్థులకు జాతీయస్థాయి 9రాష్ట్రాలతో హెచ్ఐవీ ఎయిడ్స్ పై క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ కాంపిటేషన్ హనుమకొండ గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు పోటీపడి ప్రథమ బహుమతి సాధించి హనుమకొండ జిల్లా, తెలంగాణ రాష్ట్ర కీర్తి పతాకాన్ని జాతీయస్థాయిలో ఎగరవేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హనుమకొండ జిల్లా వైద్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, అడిషనల్ డీఎంహెచ్ ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు ఫోను ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విద్యార్థులు గతంలో జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కాంపిటీషన్ ప్రోగ్రాంలో ప్రథమ స్థానంలో నిలవడం జరిగింది. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులు గండి సహస్ర, నలిమెల అక్షయకు రూ.50,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీలను న్యాకో అధికారిని సుచి గౌతమ్, చత్తీస్ గఢ్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి జే రావు చేతుల మీదుగా అందించారు. రీజినల్ స్థాయిలో గుర్తింపు తెచ్చినందుకుగాను జిల్లా డాప్కో టీం స్వప్నమాధురి, కమలాకర్, రామకృష్ణ రమేష్ లను, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అభినందనలు తెలియజేశారు.

# ఆ కోపానికి కారణం అదేనా..



టాలీవుడ్ యాక్టర్ అడివి శేష్ గూడాఛారి-2 సినిమాతో పాటు చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత ఓ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రాజెక్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ కొత్త ప్రాజెక్ట్ ద్వారా షనియల్ డియో అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానుండగా.. శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇప్పటికే ఈ సినిమా టైటిల్‌ను డిసెంబర్ 18న అనౌన్స్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఇక ఈ పోస్టర్‌లో శృతి హాసన్ ఉండగా.. ఆమె కోపంగా ఉండడానికి అతడి ఫైర్ కారణం‘. అని పోస్టర్‌కు క్యాప్షన్ ఇచ్చారు. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుంది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.





# అక్షరాలా 10,116 రూపాయలు

సలార్’ చిత్రంలో యాక్షన్‌తో పాటు హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి. ఈ తరహా పాత్ర నేను ఇప్పటివరకు చేయలేదు. నా కెరీర్‌లో ఇదొక విభిన్నమైన చిత్రం’ అన్నారు అగ్ర హీరో ప్రభాస్. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం ’సలార్’ ఈ నెల 22న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ప్రభాస్ సినిమా తాలూకు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ’సలార్’ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. పాత్రల మధ్య చక్కటి భావోద్వేగాలు ఉంటాయి. నన్ను ఇప్పటివరకు చూడనటువంటి పాత్రలో చూస్తారు. ప్రశాంత్‌నీల్‌తో సినిమా అనుకున్నప్పుడు.. నా మైండ్‌లో ఉన్న ఆలోచనలను అతని ముందుంచాను. అందరికి రీచ్ అయ్యేలా సినిమా ఉండాలని చర్చించాం. నా ఐడియాస్‌లో కొన్ని ప్రశాంత్‌కు నచ్చాయి. ఇద్దరం కలిసి వర్క్‌షాప్స్ చేశాం. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా సరదాగా షూటింగ్ జరిగింది. షూటింగ్ ఆరంభమైన నెలరోజుల్లోనే మేమిద్దరం మంచి స్నేహితుల మయ్యాం. దర్శకుడు ప్రశాంత్‌నీల్ హీరోలను గొప్పగా చూపించాలని తపిస్తాడు. ఈ సినిమాలో నా పాత్రను కూడా పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దాడు. ఈ పాత్ర కోసం నేను ప్రత్యేకంగా కష్టపడలేదు. క్యారెక్టర్ డిమాండ్ మేరకు కాస్త కండలు పెంచాలని దర్శకుడు చెప్పారు. ఆయన కోరుకున్నట్లుగా ఫిట్‌గా తయారయ్యాను. ఈ సినిమాలో రెండు పాత్రల మధ్య చక్కటి సోదర భావం కనిపిస్తుంది. సినిమా వ్యవధి 2 గంటల 55 నిమిషాలు ఉంటుంది. యాక్షన్ ఘట్టాలు అభిమానులకు కొత్త అనుభూతిని అందిస్తాయని చెబుతున్నారు.

## సలార్ తొలి టిక్కెట్ కొన్న జక్కన్న

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్  నటిస్తున్న తాజా చిత్రం సలార్ పార్ట్ 1  కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 22న విడుదల కానుంది. మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక ఎప్పుడెప్పుడా అని ఈ సినిమాని చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక శుక్రవారం కర్ణాటకలో ’సలార్’ అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో కూడా  ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా తొలి టిక్కెట్‌ను టాలీవుడ్ స్టార్ దర్శకుడు రాజమౌళి కొనుగోలు చేశాడు. ఈ విషయాన్ని మేకర్స్ సోషల్ మీడియాలో వెల్లడించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సంధ్య 70ఎంఎం థియేటర్‌లో భారీ ధరకు ఫస్ట్ టికెట్ ను బుక్ చేసుకున్నారు జక్కన్న. ఇక ఈ టికెట్ ధర చూసుకుంటే.. అక్షరాలా 10,116 రూపాయలు అని సమాచారం. ఇక రాజమౌళి ఫస్ట్ టికెట్‌ను ఇంత ధరకు కొనడంతో.. ఈ మూవీపై అంచనాలు మరింతగా పెరిగాయి. కాగా ఈ సినిమా.. నైజాం హక్కులను మైత్రీ మూవీ మేకర్స్ దక్కించుకున్నారు.



## త్వరలోనే ఓటిటిలోకి ..

టాలీవుడ్ హీరోయిన్ పాయల్ రాజ్‌పూత్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ’మంగళవారం. ఆర్ ఎక్స్ 100 ఫేమ్ అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. నందిత శ్వేత, దివ్య పిళ్ళై, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మిస్టీరియస్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 17న విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది.  ఇక థియేటర్ ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ఈ సినిమా ఓటీటీ హక్కులను దక్కించుకున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్‌పై డిస్నీ నిర్వహకులు అధికారికంగా ప్రకటించనున్నారు. అయితే ఈ సినిమా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 26న మంగళవారం రోజునే స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమా కథలోకి వెళితే.. ఒక ఊర్లో ప్రతి మంగళవారం అక్రమసంబంధం కలిగివున్న జంట భయంకరంగా హత్యకు గురవుతుంటారు. వారి బండారాన్ని ఓ అగంతకుడు ఊళ్లో ఏదో ఒక గోడమీద రాసి ఆ జంటను చంపుతుంటాడు. ఆ మిస్టరీని ఛేదించటానికి లేడీ ఎస్ఐ రంగంలోకి దిగుతుంది. కానీ ఊరు సహకరించదు. ఈ క్రమంలో ఆ ఊరుకి సంబంధించిన ఓ కుర్రాడు గోడమీద రాస్తూ ఊరిజనానికి దొరికిపోతాడు. వాడ్ని తన్నీ స్టేషన్‌కి అప్పజెబుతారు. అయితే, మరణించిన శవాల పోస్ట్‌మార్టం రిపోర్ట్ ప్రకారం చంపింది ఆ దొరికిన కుర్రాడు కాదు. దాంతో అతడ్ని పోలీసులు వదిలేస్తారు. ఇంతకీ ఆ హత్యలకు కారణం ఏంటి..ఎవరు చంపుతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగిలినకథ.

# నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు

## బడా భవనాల అనుమతుల మంజూరుకు క్షేత్రస్థాయి పరిశీలనలు

## బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జీడబ్ల్యూఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పరిశీలన, గృహనిర్మాణ అనుమతుల మంజూరు నిమిత్తం స్థలాలను శనివారం బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుపుతామని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా స్పష్టం చేశారు. బల్దియా పరిధి లో వివిధ ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి అయిన వివిధ అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల కోసం హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ బాలసముద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు పనులు, నంది హిల్స్ సమీపంలో కల్వర్టు, డ్రైన్ పనులు, శ్యాయంపేటలో డ్రైన్ నిర్మిత పనులను, ప్రెసిడెన్సీ స్కూల్ సమీపంలో డ్రైన్ , గోకుల్ నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ లను పరిశీలించి అగ్రిమెంట్ లో పేర్కొన్న నిబంధనల మేరకు పనులు పూర్తి చేశారో పరిశీలించారు. వివిధ బడా భవనాల నిర్మాణాల అనుమతుల కోసం టీఎస్-బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వాటికి అనుమతులు మంజూరు చేయడం కోసం హనుమకొండ ప్రాంతం లో బాలసముద్రం, ప్రశాంత్ నగర్, నంది హిల్స్, హసన్ పర్తి, భీమారం, నయీం నగర్ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కమర్షియల్ నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ల జారీ కోసం నిర్మాణాలను పరిశీలించారు. అంతకు ముందు బాలసముద్రంలో గల క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాన్ని సందర్శించిన కమీషనర్, శిక్షణ కలెక్టర్ కు ఇంజనీరింగ్ అధికారులు క్వాలిటీ నిర్ధారణ తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ సంతోష్ బాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు బషీర్, సుష్మ, ఏఈలు కార్తీక్ రెడ్డి, అజ్మీరా శ్రీకాంత్, శానిటరీ ఇన్ స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్తాన్ పై విజయమే విజయ్ దివాస్

### ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన ఆధ్వర్యంలో శనివారం విజయ్ దివాస్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకొని జై జై మాత భారత, మాతాకీ జై అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీ అనంతరం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ 1971లో జరిగిన భారత్ పాకిస్తాన్ కు యుద్ధం జరిగిందని ఈ యుద్ధం 13 రోజులు కొనసాగిందని, డిసెంబర్ 16న పాకిస్తాన్ పై భారతదేశం విజయం సాధించిందని, ఆ విషయాన్ని గుర్తుగానే భారత దేశంలో విజయ్ దివాస్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్ , నిగ్గుల శ్రీదేవి, విద్యా వాలంటీర్లు బాబురావు, పరిషవేని జ్యోతి, అంగన్వాడీ టీచర్ భీముడి లక్ష్మి , సంధ్య, ఐఈఆర్పీ రమేష్, ఆయాలు అరుణ, సుశీల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేస్తామని ప్రకటించిన సీఎం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అసెంబ్లీలో శనివారం జరిగిన చర్చల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్ లో ఉన్న మూడు డీఏలను వెంటనే ఇస్తామని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి (సీపీఎస్) పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటన చేయడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, కార్మిక సంఘాల జేఏసీ ద్వారా హర్షం వ్యక్తం చేశాయి. రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు, మాజీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పిల్లి సాంబశివరావు, బత్తిని సుదర్శన్ గౌడ్, మంచిక ప్రమోద్ కుమార్ గౌడ్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయం లోని తన ఛాంబర్ లో కలిసి మేనిఫెస్టోలో పెట్టిన ఉద్యోగుల న్యాయమైన సమస్యలు అన్నింటిని తొందరగా పరిష్కరించాలని కోరగా ముఖ్యమంత్రి వెంటనే స్పందించి తప్ప కుండా వెంటనే పరిష్కరిస్తా అని హామీ ఇచ్చిన విధంగా నే నేడు అసెంబ్లీ లో ప్రకటన చేయడం హర్షించ తగ్గ విషయమన్నారు. ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు మంచిక ప్రమోద్ కుమార్ గౌడ్ మాట్లాడుచూ ఉద్యోగులకు ఆరు నెలల్లోనే నూతన పీఆర్సీ అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటన చేయడం పట్ల ఉద్యోగులు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు.

## ఈ-ఆఫీస్ విధానంపై అధికారులకు శిక్షణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాల్‌లో ఈ-ఆఫీస్ విధానంపై ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని అమలుపరిచేందుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ-ఆఫీస్ విధానంలో కొత్తగా ఫైల్ ను ఎలా మొదలు పెట్టాలి, నోట్ ఫైల్ ను ఎలా తయారు చేయాలి, డ్రాఫ్టింగ్, పై అధికారులకు ఎలా పంపించాలి, డిజిటల్ కీతో ఎలా సంతకం చేయాలి అనే అంశాలపై డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్స్ ఆఫీసర్ విజయ్ కుమార్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీధర్ వివరించారు. డీఆర్ఓవైవీ గణేష్, అధికారులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో 52వ విజయ్ దివస్ సందర్భంగా యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో శనివారం తలసేమియా బాధితులను కాపాడేందుకు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి అతిథులుగా రెడ్ క్రాస్ పాలకవర్గం విచ్చేసి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ 52వ విజయ్ దివస్ సందర్భంగా దేశ భక్తిని సామాజిక స్పృహను నేటి యువతలో నింపడానికి హనుమకొండ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో తలసేమియా పిల్లల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్ (రెడ్ క్రాస్) ఆర్గనైజర్లను , రక్తదాతలను రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ పక్షాన అభినందించారు. అనంతరం విజయ్ దివస్ సందర్భంగా ఆర్మీ వీరసైనికుల చిత్రపటానికి పులామాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ యం. శేషుమాదవ్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ డాక్టర్ మదన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ జీవితకాల సభ్యులు కుసుమ శ్యామసుందర్, ఈశ్వర్, రవి వర్మ, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, యువ నేతాజీ పౌండేషన్ సభ్యులు గజ్జెల సుమన్, పృథ్వీ అలువాల, బొట్టు కమలాకర్ (ఎస్ పీఎఫ్ కానిస్టేబుల్), రెడ్ క్రాస్ సిబ్బంది సురేష్, కరుణ శ్రీ, శ్రీకాంత్, పవన్, అనిల్ అధిక సంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం హర్షనీయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించడం హర్షనీయం అని వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల వెంకట రమేష్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద, బడుగు బలహీన వర్గాల మహిళల మొహాల్లో ఎక్కడ లేని సంతోషం కనబడుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి తెలంగాణ రాష్ట్ర మహిళల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకున్నదని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఉచిత బస్సు ప్రయాణంపై పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారని వారి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆర్టీసీ నష్టాల్లో ఉండడానికి గత ప్రభుత్వమే కారణమన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై పక్కా క్లారిటీతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారన్నారు. మహిళా లోకం సీఎం రేవంత్ రెడ్డికి ఎప్పుడు అండదండగా నిలుస్తుందన్నారు.

## అయ్యప్ప స్వాములకు మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని కాశిబుగ్గ 19వ డివిజన్ లో శనివారం శ్రీ సీతారామస్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, దుర్గాదేవి దంపతులు, వంశీకృష్ణ, నవీన దంపతులు, సృజన కుటుంబ సభ్యులు విచ్చేసి అయ్యప్ప స్వాములకు మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నరేందర్ దంపతులకు వంశీకృష్ణ దంపతులకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యుడు కూచన ఏకాంబరం, కాంగ్రెస్ నాయకులు తోట బాలరాజు, నీలం శ్రీనివాస్, తదితర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాయిస్, డబ్బింగ్ శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పట్టణంలో హైదరాబాద్ "పీవీఆర్ డబ్బింగ్ అకాడమీ" ఆధ్వర్యంలో సినిమా, టీవీ రంగాలకు సంబంధించి వాయిస్ ఓవర్(డబ్బింగ్) శిక్షణ తరగతులు ఈ నెల 22 నుంచి 31 వరకు "ఆదర్శ లా" కళాశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు "పూసపాటి వినోద్ కుమార్ రాజు" తెలిపారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ .. తెలంగాణ గడ్డ ఎన్నో చారిత్రాత్మకమైన ప్రదేశాలు, ఎన్నో కళలకు, సాంప్రదాయాలకు పుట్టినిల్లు. స్వరమాంత్రికుడు "పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ ను ఆదర్శంగా తీసుకొని ఓరుగల్లులో కూడా వాయిస్ రంగాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. గళ మాంత్రికులను తయారు చేసే ఉద్దేశంతో పీవీఆర్ డబ్బింగ్ అకాడమీ చేస్తున్న ఒక గొప్ప ప్రయత్నమన్నారు. మొట్టమొదటిసారి సినిమా, టీవీ రంగాలలో వాయిస్ ఆర్టిస్టులను తయారు చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే సదుద్దేశంతో డబ్బింగ్, వాయిస్ యాక్టింగ్ వర్క్ షాప్ ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆసక్తి గలవారు 7416222599, 7674092927 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూసపాటి వినోద్ కుమార్ రాజు (డబ్బింగ్ ఆర్టిస్ట్ అండ్ ట్రైనర్), డా.చిర్ర రాజు గౌడ్ (ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు), మాడ సునిల్(వాయిస్ ఓవర్ అండ్ డబ్బింగ్ ఆర్టిస్ట్), బాలకృష్ణ పాఠక్, అంజన్ కుమార్ (మిమిక్రీ కళాకారులు), శైలజ (తెలుగు మూవీ అండ్ డబ్బింగ్ ఆర్టిస్ట్), పూసపాటి ఉమాదేవి, పంతుల సుధా మాధురి పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com